## వేడుకగా ఆలయ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజవర్గంలో ప్రతిష్టాత్మకమైన అడిక్‌మెట్ ఆంజనేయస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. పిట్టల ప్రభాకర్‌రావు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా, చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా నూతన ఆలయ ధర్మకర్తలుగా డి.రాజ్‌కుమార్, జి.సందీప్, వి.స్వాతివర్మ, పి.స్నేహలత, కె.కోదండపానిలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## రాంనగర్‌లో రోడ్లు నిర్మించాలి



సికింద్రాబాద్ జెడ్‌సీకి వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్‌లో రోడ్లు నిర్మించాలని సికింద్రాబాద్ జెడ్‌సీ రఘుకిరణ్‌కు కార్పొరేటర్ కె.రవిచారి వినతి పత్రం సమర్పించారు. ఉదయ్‌నగర్, పవిత్రానగర్, ఆజామాబాద్‌లో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

## అక్రమ భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: పద్మకాలనీలో నిర్మిస్తున్న ఓ భవనంపై బల్దియా కమిషనర్‌తో సహా టౌన్‌ప్లానింగ్, జోనల్ కమిషనర్, ఉప కమిషనర్‌కు రెండేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని మాతా వాక్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లింగ ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ భవన నిర్మాణం చేపడుతున్నారని ఇటీవల ఫిర్యాదు చేస్తే జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారని కానీ మళ్లీ ఆ ఇంటి యజమాన్ని జీహెచ్‌ఎంసీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల అండదండలతో ఈ అక్రమ నిర్మాణం కొనసాగుతుందని వారే ఈ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నారని ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టాలన్నారు.


## కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి

ముషీరాబాద్: నేచర్ లైఫ్ స్పేస్ సంస్థ రూపొందించిన-2025 నూతన సంవత్సర కేలండర్‌ను పర్యాటక, సంస్కృతిక, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ రమేష్ మూడు, కోఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ మేఘన రమేష్, పెసిడెంట్ వినాయక్, నగేష్, రాజశేఖర్, రవీందర్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

**సుందరయ్య పార్కులో...**



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ రూపొందించిన 2025 నూతన కేలండర్‌ను బుధవారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ కె. లింగప్రకాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి వీరయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు వి.నాగభూషణం, కందురి కృష్ణ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎస్. రమేష్‌రెడ్డి, ఎం.దశరథ్, శంకర్‌రావు, ఆర్.వివేక్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 31 లోగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలు చెల్లించండి

బంజారాహిల్స్: ట్రేడ్ లైసెన్స్ ఫీజు, బకాయిలను ఈ నెల 31 లోగా చెల్లిస్తే జరిమానా ఉండదని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ యాప్, మీ సేవా కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ సిటిజన్ సర్వీస్ సెంటర్ ద్వారా చెల్లించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# చలితో గజగజ... జ్వరాలతో విలవిల!

- దగ్గు, జ్వరం, జలుబు, కీళ్ల నొప్పులు, తల భారంతో సతమతం
- భయపెడుతున్న టైఫాయిడ్ జ్వరాలు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న జనం
- ఆస్పత్రుల్లో చేరుతున్న వారే అధికం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో పరీక్షల పేరిట రోగుల రక్తం తాగేస్తున్న వైద్యులు
- వ్యాధుల వ్యాప్తి నివారణ చర్యలు తీసుకోవాలంటున్న జనం



ఫీవర్ ఆస్పతి వార్డులో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు (ఫైల్)

నల్లకుంట: వాతావరణంలో మార్పులు, ఉదయం పొగ మంచు, చీకటి పడగానే విపరీతమైన చలితో జనాలు వణుకుతున్నారు. దీంతో జలుబుతో బాధపడే వారు మరింత అస్వస్థతకు గురవుతున్నారు. ఆ తర్వాత దగ్గు, జ్వరం బారిన పడుతున్నారు. చలి తీవ్రత కారణంగా వ్యాధుల భారిన పడి చికిత్సల కోసం ఆస్పత్రులకు బారులు తీరుతున్న రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

◆ హైదరాబాద్ నగరాన్ని జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. వాతావరణ మార్పులు, శీతాకాలం, చలి గాలులు తోడవడంతో చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారు. దీనికి తోడు పారిశుద్ధ్యం కొరవడడంతో మురికి వాడలు, బస్తీలలో సీజనల్ వ్యాధులు ముప్పేట దాడి చేస్తున్నాయి. తీవ్ర చలిగాలులకు చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు జ్వరాల భారిన పడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ తదితర విష జ్వరాలతో జనం ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు పొగ మంచు కారణంగా జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళన ఎక్కువైంది. జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులు, తలభారం, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల వద్ద జనం బారులు తీరుతున్నారు. మరి కొందరు తీవ్ర జ్వరం, కఫంతో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల్లో ఇన్‌పేషంట్లుగా చేరి రోజుల తరబడి చికిత్సలు పొందుతున్నారు.



దోమలకు నిలయంగా విద్యానగర్ రైల్వే స్టేషన్ ప్రహరీ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

**ఫీవర్‌కు పెరుగుతున్న ఓపీ..**

నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి ఓపీ రోగుల తాకిడి పెరుగుతుంది. జిల్లాలో జ్వరాల తీవ్రత పెరిగింది. పారిశుద్ధ్య విభాగంలో దోమల నివారణ చర్యలు చేపట్టక పోవడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు బాగా పెరిగాయి. అంబర్‌పేట నియోజక వర్గంలోని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రితో పాటు బస్తీ దవాఖానాలకు, యూపీహెచ్‌సీలకు రోగులు క్యూ కడుతున్నారు. ఫీవర్ ఆసుపత్రికి రోజూ 400 నుంచి 700 వరకు జ్వర లక్షణాలతో వచ్చే వారే కనిపిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు సైతం వందల సంఖ్యలో జ్వరాలతో క్యూ కడుతున్నారు. ముఖ్యంగా జ్వరపీడితుల్లో ఎక్కువగా పిల్లలు, వృద్ధులే ఉంటున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం ప్రస్తుతం కురుస్తున్న పొగ మంచు, చలిగాలులేనని చెబుతున్నారు.

**జ్వర పీడితుల్లో కనిపిస్తున్న లక్షణాలు...**

- విపరీతమైన తలనొప్పి, తలభారం
- గుండె నొప్పిగా అనిపించడం, అలసట, కీళ్ల నొప్పులు.
- విపరీతమైన దగ్గు, గొంతునొప్పి, జలుబు

**కొరవడిన పారిశుద్ధ్యం..**

అంతర్గత వీధుల్లో ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తగుతున్న చెట్ల కొమ్మలను ఇటీవల తొలగించి వీధుల్లో కుప్పలుగా వేయడంతో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో దోమల ఉధృతి పెరిగి సీజనల్ వైరస్‌లు విజృంభిస్తున్నాయి. బస్తీలలో డ్రైనేజీలోంచి వ్యర్థాలను తొలగించి అక్కడే కుప్పలుగా పోసి వదిలేయడంతో, వీధుల్లో చెత్తాచెదారం పేరుకు పోతుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాల్సి ఉండగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఈ కారణాలతో దోమలు విరుచుకుపడి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నాయి.

**క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు శూన్యం..**

జిల్లా వ్యాప్తంగా విష జ్వరాలు విలయతాండవం చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జ్వరాల కట్టడికి కనీస చర్యలు చేపట్టడం లేదు. జ్వర పీడితులను గుర్తించి వారికి మందులు, మాత్రలు ఇచ్చే కార్యక్రమాన్ని మర్చిపోయినట్టు కనిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు పూర్తిగా గాడి తప్పాయి. అలాగే పలు బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు చుట్టపు చూపుగా కనిపిస్తున్నారు. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా డ్యూటీలకు వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనాస్పందించి జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకండి**



గత కొద్ది రోజులుగా ఫీవర్‌కు వచ్చే జ్వర పీడితుల సంఖ్య పెరిగింది. రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించడ మంచిది. చలికాలంలో గోరు వెచ్చటి నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిది. వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదు. కుటుంబంలో వ్యక్తి జబ్బు బారిన పడితే మిగిలిన సభ్యులకు కాస్త దూరంగా ఉండడం మంచిది. ముఖ్యంగా చిన్న పిల్లల దగ్గర అసలు ఉండకూడదు. దోమల వ్యాప్తి, వాతావరణంలో మార్పుల కారణంగా విష జ్వరాలు, టైఫాయిడ్, చికూన్ గన్యా కేసులు నమోదవుతున్నాయి. ఇలాంటప్పుడు నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే వైద్యులను సంప్రదించాలి. రక్త పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి, సొంత వైద్యం వద్దు.

– ప్రొ. డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫీవర్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

## వాకర్స్ క్లబ్ కార్యవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు

**పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ**

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన కార్యవర్గానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అభినందనలు తెలిపి సన్మానించారు. బుధవారం తన కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, కోశాధికారి ఎం.దశరథ్, ఉపాధ్యక్షుడు బి.కళ్యాణ్‌నాయక్‌లను ఎమ్మెల్యే ముఠాగోపాల్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్కు అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారుడు వెంకటకృష్ణారావు, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, రఫీ అహ్మద్, ముచ్చకుర్తి ప్రభాకర్, కె. నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిసిన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే సాఫీగా సాగేలా చర్యలు



జవహర్‌నగర్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తున్న ప్రాపర్టీ ట్యాక్స్ అధికారి సత్యనారాయణ



ముషీరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

చిక్కడపల్లి: ప్రజా పాలనలో సొంత ఇంటికోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించేందుకు ప్రాపర్టీ ట్యాక్స్ అధికారులు బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని జవహర్‌నగర్, అశోక్ నగర్‌లలో సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువనేత ముఠాజైసింహ దృష్టికి గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు తీసుకెళ్లారు. ముఠాగోపాల్ జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మాట్లాడి జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ అధికారి, బిల్ కలెక్టర్ సత్యనారాయణ అద్దె ఇల్లా లేక సొంత ఇల్లా.? అనే వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకు 200 దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. అర్హులైన వారి వివరాలను ఉన్నత అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టారు.

**ముషీరాబాద్‌లో..**

ముషీరాబాద్: ప్రజాపదంతో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించేందుకు బుధవారం రెవెన్యూ అధికారులు ముషీరాబాద్‌లో పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫొటోలు తీశారు.

## మనువాదుల మూకదాడులను ఉపేక్షించేంది లేదు

**టి.స్కైలాబ్ బాబు**

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మనువాదుల మూకదాడులను ఉపేక్షించేంది లేదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు అన్నారు. భక్తి ముసుగులో మనువాదులు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై అమానుషంగా దౌర్జన్యం చేసి విద్యార్థి కాళ్లు మొక్కించారని ఇదెక్కడి హిందూ ధర్మమని ప్రశ్నించారు. బుధవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ... ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అవమానం ఒక ఉపాధ్యాయ లోకంతో పాటు తెలంగాణ సమాజానికే అవమానకరమని అన్నారు. రాష్ట్ర రాజధానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు చేస్తున్న దుర్మార్గాలను కట్టడి చేయాలన్నారు. బాధిత ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములు మాట్లాడుతూ... ఒక దళిత టీచర్ అయినందునే ఇంత అమానుషంగా తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన విద్యార్థి కాళ్లు తనతో మొక్కించడం తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని అన్నారు. కేవలం విద్యార్థి కాళ్లే కాదు, అయ్యప్ప మాల ధరించిన అందరి కాళ్లు మొక్కాలని బెదిరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యదర్శి ఎం.వెంకటప్ప, వివిధ సంఘాల నాయకులు టి.నాగరాజు, పుట్టా లక్ష్మణ్, ఒంగూరి రాములు, డి.ప్రసాద్, కోట రమేష్, కడమంచి రాంబాబు, జె.చక్రవర్తి, గడ్డం సుధాకర్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



ఎస్‌వీ కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

## 11, 12వ తేదీల్లో ఉచిత దంత చికిత్స శిబిరం

నల్లకుంట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఈనెల 11, 12వ తేదీలలో దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత చికిత్స శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్. రంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని దత్తసాయి దంత వైద్యశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి అన్ని రకాల దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టూత్ పేస్ట్ కూడా ఉచితంగా అందజేస్తామని చెప్పారు. నగరంలోని ఆయా ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నం.92463 66944 నంబర్‌లో సంప్రదించగలరు.

## లండన్‌లో అడిక్‌మెట్ వాసి మృతి



రాంరెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



గంగం రాంరెడ్డి(ఫైల్)

ముషీరాబాద్: లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌గా ఉద్యోగం చేస్తున్న గంగం రాంరెడ్డి రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బాలాజీనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. రాంరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. గంగం రాంరెడ్డి అంత్యక్రియలు బుధవారం అంబర్‌పేట శ్మశానవాటికలో ముగిశాయి.

## పేదలను విద్యావేత్తలుగా తీర్చిదిద్దిన మహనీయుడు సుభాష్‌చంద్రారెడ్డి



సుభాష్‌చంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, మనోజ్‌రెడ్డి



వర్ధంతిలో సందర్భంగా అన్నదానం చేస్తున్న కుమారుడు మనోజ్‌రెడ్డి, పోటీ పరీక్షల విద్యార్థులు

చిక్కడపల్లి: ఎంతో మంది పేద గ్రామీణా విద్యార్థులను ఉన్నతమైన చదువులు చదివించి గొప్ప విద్యావేత్తలుగా తీర్చిదిద్దిన ప్రముఖ విద్యావేత్త సుభాష్‌చంద్రారెడ్డి అని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కొనియాడారు. బుధవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కె.సుభాష్‌చంద్రారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావుతో కలిసి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. సుభాష్‌చంద్రారెడ్డి ఆశయాల కోసం ప్రతి సంవత్సరం 20మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యకోసం తమ వంతు ఆర్థిక సహాయం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రతేజరెడ్డి, ప్రణవన్, శివకుమార్‌గౌడ్, రామారావు, లక్ష్మణ్‌రావులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు

అంబర్‌పేట: బతుకమ్మ కుంట స్వాధీనానికి మార్గం సుగమం కావాడానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు చేసిన కృషి ఫలించిందని కాంగ్రెస్ నేతలు అన్నారు. బతుకమ్మ కుంటపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో వీహెచ్ ఇంటి వద్ద కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, రామ్మోహన్, చందులాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీ వీహెచ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

## హరియాణా గవర్నర్ నివాసం వద్ద కూలిన ప్రహరీ

ముషీరాబాద్: రాంనగర్‌లోని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఇంటి పక్కన ఉన్న ప్రహరీ గోడ కూలడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఇటీవల దత్తాత్రేయ తన నివాసం నుంచి ఇటీవల పక్కనే నూతన భవనాన్ని నిర్మించి అందులోకి మారారు. పాత భవనాన్ని డెవలప్‌మెంట్ కోసం తీసుకున్న బిల్డర్ కూల్చివేత పనులు చేపట్టాడు. అయితే, భవనం కూల్చివేస్తున్న క్రమంలో కాంట్రాక్టర్ ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రహరీ కూలి ఇంటి పక్కనే ఉన్న కాకునూరి సుధాకర్ అనే వ్యక్తి ఇంట్లో పడిపోయింది.

ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ గోడ కూలడంతో ఇంటి సామాన్లు, మట్టి పెళ్లలు పాత ఇంటి మీద పడి దెబ్బతిన్నాయి.



ఈ విషయంపై సుధాకర్ ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో, హైడ్రాకు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. భద్రతా చర్యలు లేకుండా కూల్చివేతలు వద్దని తాను కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సుధాకర్ ఆరోపించారు.

## క్విడ్ ప్రోకో ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దోపిడీ

**వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ బక్క జడ్సన్**

ముషీరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్విడ్ ప్రోకో ద్వారా వేల కోట్ల తెలంగాణ సంపదను దోచుకుంటున్నారని వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఆరోపించారు. బుధవారం రాత్రి గోల్కొండ చౌరస్తాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ ఇరిగేషన్ ప్రాజెక్టులోనే ఈ క్విడ్ ప్రో కో జరిగిందని పేర్కొన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా రూ.158కోట్లు ఇచ్చారని ఆరోపించారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు కొడంగల్ లిఫ్ ఇరిగేషన్ పనులను ఎలా అప్పగించారని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడ్డాక క్విడ్ ప్రో కో ద్వారా అతిపెద్ద దోపిడీకి రేవంత్‌రెడ్డి తెర తీశారన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించే ఎల్‌అండ్‌టీని కాదని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు కొడంగల్ ప్రాజెక్టును ఎందుకు ఇచ్చారన్నారు. హోంశాఖ సీఎం దగ్గర ఉంది కాబట్టి చిత్తశుద్ధి ఉంటే ఈ విషయాలపై ఎంక్వైరీ చేయించాలని రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న ఈ దోపిడీ మీద సెంట్రల్ విజిలెన్స్‌కు, సుప్రీంకోర్టుకు పోతామని తెలిపారు. రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేస్తానన్నారు. గత కాంగ్రెస్ పార్టీ వేరని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ పార్టీ వేరని తెలిపారు. క్విడ్ ప్రో కో ద్వారా మెగా రాఘవ, రేవంత్‌ల దోపిడీ మీద న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.



## ఇరుముడి కట్టు శబరిమలెక్కు..!

చిక్కడపల్లి: అయ్యప్పస్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అన్ని విజయాలు సిద్ధిస్తాయని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్టీసీక్రాస్ రోడ్డులోని ప్రసిద్ధిచెందిన శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో అయ్యప్పమాలధారులు మండల దీక్ష పూర్తి చేసుకోవడంతో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఉమేష్‌స్వామి నేతృత్వంలో స్వాములు శబరిమలకు బయల్దేరారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వాములు క్షేమంగా వెళ్లి స్వామివారి దివ్య దర్శనం చేసుకుని తిరిగిరావాలన్నారు. ఎం.ఉమేష్ స్వామి నేతృత్వంలో బండారి భారత్‌గురుస్వామి, సుక్క యాదగిరిగురుస్వామి, చిర్ర యాదగిరి గురుస్వామి, విజయ్‌కుమార్ గురుస్వామి, సాయి కృష్ణ గురు స్వామి, సిద్ధార్థగురు స్వామి, చంద్రశేఖర్ గురుస్వామి, విఘ్నేష్‌గురుస్వామి , సాయికృష్ణ గురుస్వామిలు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో రత్న సాయిచంద్, శ్రీకాంత్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, నర్సింహ, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.



లక్ష్మీగణపతి దేవాలయంలో శబరిమలకు బయల్దేరుతున్న స్వాములతో బీజేపీ నేత వినయ్‌కుమార్

## అజ్మీర్ దర్గాకు చాదర్

ముషీరాబాద్: భోలక్‌పూర్ బడీమసీద్ వద్ద నిర్వహించిన అజ్మీర షరీఫ్ దర్గాకు సమర్పించే చాదర్ కార్యక్రమానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. అర్హులందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, మహ్మద్‌ఖాజా, సిరాజుద్దీన్, రౌఫ్, ముబాషిర్, సహాఫాజ్‌ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

